


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



### *కాశీకి పోయాను రామా హరీ!*

**కాశీకి వెళ్ళి ఒకావిడ మొగుడ్ని వదిలేసి** వచ్చిందిట. "ఎందుకమ్మా" అంటే..

"మరి ఇష్టమైనది వదిలెయ్యాలి కదండీ" అందట అమాయకంగా.

మా నాన్న ఏం తక్కువ తినలేదు. కాశీకి వెళ్ళి 'అత్తిపండు' వదిలేసి వచ్చారు.

"నాన్నా నీకు అత్తిపండు ఇష్టమా?" అంటే,

"నేను ఎప్పుడూ చూడలేదు" అన్నారు.

"మరి ఎందుకొదిలేసావు? " అంటే

"అనపిండి వారి లక్ష్మి గంగలో రెండు మునకలేసి తలెత్తాక "ఏం వదిలేసావు?" అని మా నాన్న అడిగితే "అత్తి" అందంట.. ఈయన వెంటనే "నేనూ అదే" అని బుడుంగున మునిగారుట. కానీ తర్వాత తెలిసిన సారాంశం ఏవిటంటే ఆవిడకి చచ్చేటంత 'నత్తి' అందుకే నత్తి వదిలేసానంది గంగలో. ఈయన అది అత్తి అనుకుని అత్తిపండు వదిలేసారు.

మా పిల్లలకి చదువు చెప్పేటప్పుడు fig ని ఇదే ఫిగ్.. అత్తిపండు అనగానే ఆయన ఆ చార్ట్ తిరగేసి అక్కడినుండి వెళ్ళిపోయేవారు. అలా జీవితంలో ఒక్కసారైనా చూడనీ, తిననీ అత్తిపండుని మా నాన్న కాశీలో వదిలేసారు.

ఓ రచయిత గురించి నా మిత్రుడు 'వాడు మానం అభిమానం కాశీలో వదిలేసి వచ్చాడు' అని చెప్తుంటాడు. అవునులెండి ఎవరికి ప్రియమైనది వారు వదిలేస్తారు. మా పరుశురాంగారు ఆ కాకరకాయ వదిలేసారు. ఎందుకంటే అది 'ప్రియమైనది'. ప్రియం అంటే ఇక్కడ ఖరీదు. పావుకిలో నలభై రూపాయిలు పదో పదకొండో కూడా తూగవు మరి.

వెనకటికో తాతగారు కాశీ వెళ్ళి వచ్చారుట.

ఓ కొంటె కుర్రాడు "తాతయ్యా ఏం వదిలేసావు? " అన్నాడుట.

తాతగారు "కోపం నాయనా" అన్నారుట.

వాడు ఇంకో రెండు అడుగులు ఆయనతో నడిచి "తాతా ఏం వదిలేసొచ్చావు?" అన్నాడుట.

ఆయన "కోపం" అన్నారుట.

వాడు మళ్ళీ నవ్వుకుని "తాతా ఏం వదిలే.." అనగానే

"కోపం రా చచ్చినాడా! ఇంకోసారి అడిగితే పుచ్చె విరగ్గొడ్తాను" అని చండప్రచండుడే అయ్యాడుట తాత. ఇలా ఉంటుంది కొంతమంది వదిలెయ్యడం.

మన తెలుగు ఏంకర్స్ వత్తులూ, 'ళ' అక్షరం వదిలేసారు. ఆడపిల్లలు బొట్లూ, పైటలూ వదిలేసారు. తెలుగు బడిలో 'అలు అలూ' ఇంక 'అరు అరూ' వదిలేసాము.

భాషని ఖూనీ చెయ్యడం విషయంలో సినిమాలూ, టీ.వీలూ, పత్రికలూ, రేడియోలూ అన్నీ తమ తమ స్థాయిని బట్టి పోటీ పడ్తున్నాయి.

ఒక్కోసారి మనుషులు మనసులో ఓ మాటనుకుంటారు. కానీ బయటకి ఒకటొస్తుంది. వాళ్ళు తాము కరెక్టే అంటున్నాం అనుకుంటారు.

అశ్లీలం అయినా ఒక ఉదాహరణ చెప్తాను. మా బాబాయ్ వాళ్ళ కాలనీలో సాయిబాబా గుడి కట్టించాలనుకున్నారు. కమిటీ మెంబర్లు నలుగురు పాపం చందాలవీ వసూలు చేసి చాలా కష్టపడ్డారు. సీతాదేవి అన్నావిడ పెద్ద మొత్తం చందాగా ఇచ్చింది.

గుడి ఓపెనింగ్ రోజున సాయిరాం అనే అతను ఈ విషయం ప్రస్తావించి సీతాదేవిగారి ఔదార్యాన్ని పొగడాలనుకుని స్పీచ్ మొదలు పెట్టాడు. "సోదరీ సోదరీమణులారా... ఈ కార్యానికై మేము రాత్రీ పగలూ చాలా కష్టపడ్డాం. ఈ విషయంగా సీతాదేవిగార్ని సంపర్కించాం.. ఆవిడ లక్షరూపాయిలిచ్చారు. ఆవిడ సహకారంతో మేము ఆనందించి, మంజులాదేవిగారిని 'సంపర్కించాం.' రంగనాధ్ వెళ్ళి 'సంపర్కించాకా' ఆవిడ లక్షరూపాయిలిచ్చారు."

ఈ సంపర్కం అనేమాట సంప్రదించడానికి బదులు వాడుతున్నాడు పాపం. ఈ విషయం విని భాస్కరంగారు ఇంక 'చాలు ఆపమని' చెయ్యి ఊపారు. సాయిరాంకి అది 'ఆయన గురించి' చెప్పమన్నట్లుగా అర్థం అయి 'భాస్కరంగారు కూడా తక్కువేం కాదు, ఛాయాదేవిగారిని సంపర్కించి, ఇక్కడ తులసికోటా, తోటా బావుంటుందని తీర్మానించారు. ఇంకా రామ్మోహనరావుగారు వెళ్ళి సంపర్కించాకా, ఛాయాదేవి గారిని ... ' అని స్పీచ్ కొనసాగిస్తుంటే, జేగురు రంగు మొహంతో ఛాయాదేవిగారు లేచి అక్కడి నుండి వాకౌట్ చేసారు.

"సంపర్కించగానే ఇంత డబ్బు సమకూర్చిన సీతాదేవిగారికి, మంజులగారికీ" అని సాయిరాం కృతజ్ఞతల ప్రహసనం ఇంకా సాగుతుండగా, భాస్కరంగారు అతన్ని రెక్కపట్టి ఈడ్చి స్టేజ్ దింపి, చెవి మెలిపెట్టి అతను ఎంత తప్పుగా మాట్లాడాడో చెప్పారు. కానీ సాయిరాం వినలేదు. తనన్నదాంట్లో తప్పులేదు 'సంప్రదించాం' అనే అన్నాను అన్నాడు. తర్వాత అతనికి వీడియో టేప్ చూపించి నిజం చెప్పాల్సొచ్చింది. అప్పుడు ఎంతగానో సిగ్గుపడ్డాడు.

ఇలాగే ఓసారి మా కాలనీలో నాగేష్ అనే పెద్దాయన, మా అమ్మ ముందే మా అన్నయ్యతో "బీకాం, క్లాస్‌లో పాసయ్యావు నాయినా. మీ అమ్మ ఆత్మకి శాంతి కలుగుతుంది" అన్నాడు.

అమ్మ నోరు తెరిచి చూస్తూండిపోయింది.

ఆయనకి ఓ డెబ్బై ఏళ్ళున్నాయి. కానీ తను అంటున్నది తప్పని ఆయన అనుకోలేదు.

అలాగే ఓ ప్రముఖ నటుడి జన్మదినం రోజున అతన్ని పిలిచి కేక్ కట్ చేయించి "ఇలాంటి వర్ధంతులు ఇంకా ఎన్నో జరుపుకోవాలి ఆయన" అని అభిలాషించాడు ఒక అభిమాని పాపం.

ఈ రోజు ఓ స్నేహితురాలి భర్తకి ఏక్సిడెంట్ అయిందని తెలిసి నేను ఆత్రుతగా ఫోన్ చేసి "నేను రానా? వచ్చి చూడనా? ఇప్పుడెలా ఉంది?" అని అడిగాను

దానికి నా అభిమానీ, స్నేహితురాలూ అయిన ఆ అమ్మాయి నసుగుతూ "మీరా? వస్తారా? ఇప్పుడా?" అంది.

"ఏం? ఇంట్లో చాలామంది ఉన్నారా?" అన్నాను.

"ఆయన రిబ్స్ ఫ్రాక్చర్ అయ్యాయి. దగ్గొచ్చినా, తుమ్మొచ్చినా కూడా కష్టం.." అంది.

"అయ్యో..ఎలా? ఎప్పటికి తగ్గుతుందీ? నేను రానా?" అన్నాను.

ఆమె ఇంకా మొహమాటంగా "అదే చెపుతున్నాను... దగ్గినా, తుమ్మినానే కాదు. నవ్వినా చాలా కష్టం. మీరూ, ఫణీ డొక్కా వస్తే ఎలా? మీరేం మాట్లాడినా మాకు నవ్వొస్తుంది కదా! ఆయన డొక్కలెగరేసి నవ్వితే ఎలా?" అంది.

అప్పటికి కానీ నాకు వెలగలేదు తనేం చెప్తోందో? అప్పుడు అర్థం అయి నేను నవ్వేసి, "అర్థం అయిందిలే, ఆయనకి తగ్గాక వస్తా" అని ఇంకో రెండు జోకులు చెప్పా, తను ఆపకుండా నవ్వుతుంటే అవతల గదిలోంచి వాళ్ళత్తగారు "ఎవరూ? రమణీనా?" అని అడగడం వినిపించింది.

నిన్న కొమ్మనాపల్లి గణపతిరావుగారు ఫోన్ చేసి "రెండే విషయాలు అడగాలి.. అడిగేసి ఫోన్ పెట్టేస్తా" అన్నారు. ఓ పది నిమిషాల అనంతరం కూడా ఇద్దరం నవ్వుతూనే ఉన్నాం. పెద్ద హీరోల సినిమాల గురించీ, కథల గురించీ మాట్లాడుకుని.

అత్తారింటికి దారేది సినిమాలో.. రావురమేష్ మీద ఎవరో పేరడీ పంపారు.

"ఆ రోజు సరిగ్గా నేను క్లాస్ రూంలో పరిక్ష పేపర్ చేతిలోకి తీసుకున్నాను.. బుర్రంతా బ్లాంక్ అయిపోయింది. అప్పుడు తెలిసింది. చీటీలు తేడం మరిచిపోయాననీ. ఏం చెయ్యాలా దేవుడా! అని చూస్తుంటే అప్పుడొచ్చాడు సరిగ్గా. ఈ అబ్బాయి అతను చీటీ అందించి నా పరీక్ష కాపాడాడు. అతను నాకోసం కాదు. నా కుటుంబం కోసం వచ్చాడు. నన్నూ నావాళ్ళనీ చీటీలిచ్చి కాపాడాడు" అని ఉంది ఆ పేరడీలో. కానీ నాకు మాత్రం అసలు సినిమాకి త్రివిక్రముడు దర్శక రచయిత కాకపోతే, ఈ కథ ఓకే అయ్యేదా? పవనుడు ఒప్పుకునేవాడా? అనిపించింది.

ఒక్కసారి ఆలోచించండి.. రావు రమేష్‌కి హార్ట్ ఎటాక్ రాకపోతే సినిమా కథేమిటి? ఆ హార్ట్ ఎటాక్ రావడంలో హీరో తెలివి సామర్థ్యాలు ఏమైనా ఉన్నాయా?

నా బోటమ్మ వెళ్ళి ఈ కథ చెపితే, సదరు దర్శకుడూ, నిర్మాతా, హీరో, వారి కుటుంబం, శ్రేయోభిలాషులూ ఉంటే సతీమణీ "ఏవమ్మా.. హార్ట్ ఎటాక్ రాకపోతే సినిమానే లేదుగా.. అంతా నీ ఇష్టమేనా? అలా హీరోకి అవసరం కాబట్టి పిలవగానే మావయ్యకి హార్ట్ ఎటాక్ వచ్చేస్తుందా? అందులో ఈయనగారి గొప్పతనం ఏ వుంది?" అని అడగరూ?

ఇలా పెద్ద హీరోల సినిమాల కథలకి కష్టపడఖ్ఖర్లేదు. చిన్న హీరోల సినిమాలకే లాజిక్‌లూ, కొంత సక్రమమైన కథా అవసరం అని మేం ఇద్దరం తెగ నవ్వుకున్నాకా, "ఇంతకాలం అత్తారింటికి దారేదిలో హార్ట్‌ఎటాక్ రాకపోతే హీరోకి అత్తారింటి దారి దొరికేది కాదని, నాకు తట్టనేలేదు" అని ఆయన తెగ ఆశ్చర్యపోయాడు.

వెనకటికి ఓసారి అక్కినేని నాగేశ్వరరావుగారే స్వయంగా నాతో చెప్పారు.

డాక్టర్ చక్రవర్తి సినిమా ఆయన నీలం సంజీవరెడ్డిగారిని పిలిచి స్పెషల్ షో వేయించి చూపించారుట.

సినిమా అంతా నాగేశ్వరరావు, సావిత్రిల అన్యోన్యతా, అనురాగం చూసి అపార్థాలతో, అనుమానాలతో జగ్గయ్య కుళ్ళిపోతూ ఉంటాడు.

చివరి రీల్లో గీతాంజలి ఫ్లాష్ బ్యాక్ ఒకటి చూపించి అర్జెంటుగా "ఆమెలో నా చెల్లెల్ని చూసుకున్నాను" అంటాడు హీరో. ఆ విషయం ఇలా చివరిదాకా దాచడం ఎందుకో? చెల్లెల్లా ఉందని మొదట్లోనే చెపితే, జగ్గయ్య హాయిగా కాపురం చేసుకునేవాడుగా.

ఇది చూసి నీలం సంజీవరెడ్డిగారు "ఈ విషయం మొదటనే చెపితే.. నా మూడు గంటలూ వృథా అయ్యేది కాదు గదయ్యా. భలేవాళ్ళే మీ సినిమావాళ్ళు" అని నవ్వారుట.

ఈ విషయం అక్కినేనిగారు నాతో చెప్పి పెద్దగా నవ్వారు.

అలాగే ఉంటాయి, పెద్ద హీరోల కథలు. ఇంక నవలలు కొంటారా, వాటిని పీకిపీకి బొంబాయి మిఠాయిలా లాగి, వాటి ఆకారాన్ని, కొన్నిసార్లు రుచినీ కూడా మారిస్తే గానీ వాళ్ళకి తృప్తి కలగదు. ఎంతో నచ్చి కొనుక్కున్న సినిమాని రీమేక్ చెయ్యడానికిస్తే దాని అసలు 'ఎసెన్స్' నాశనం చేసి కానీ వదలరు.

మొన్న మలేషియా వెళ్ళేముందు ఈ టిక్కెటింగ్ సంగతీ, అక్కడ ఏర్పాట్ల సంగతీ చూసే ఓ పెద్ద మనిషి తెలుగు కానీ ఆంగ్లము కానీ ఏదీ పూర్తిగా మాట్లాడలేడు. అరవం అతను ధారాళంగా మాట్లాడ్తాడు కానీ నాకు అస్సలురాదు.

అతను ప్రతిరోజూ ఫోన్ చేసి నాతో ఈ విధంగా మాట్లాడేవాడు.

"నేను ఎల్లుండి మలేషియా వెళ్ళాను."

"అప్పుడే వెళ్ళిపోయారా?"

"కాదు... మూడు రోజులయ్యా వచ్చింది" అన్నాడు.

"ఏవిటొచ్చింది పాపం?"

"నేనే వచ్చింది."

"అప్పుడే వెళ్ళి వచ్చేసారా? ఎందుకూ? ప్రోగ్రాం నెక్స్ట్ వీక్ కదా?"

"మీరు వెళ్ళింది నెక్స్ట్ వీక్.. నేను కూడా వచ్చింది నెక్స్ట్ వీకే."

"సరే వచ్చింది. లేదా వస్తారూ? టికెట్ కానీ పి.ఎన్.ఆర్. నెంబర్ కానీ వచ్చిందా?"

"వారు వస్తాయి..నిన్న"

"నిన్న ఎలా వస్తాయి"

"కాకపోతే మొన్న వస్తాయి.. కొద్దిగా వెయిట్ పన్ను." అన్నాడు కొద్దిగా కోపంగా.

కాలచక్రంలో నిన్నగా మొన్నగా మిగిలిపోయినవి మళ్ళీ తిరిగిరావని చిన్నప్పటి నుండీ నా విశ్వాసం, కానీ ఈ పెద్దమనిషి 'మొన్న మళ్ళీ వస్తుంది' అంటున్నాడు ఎలా నమ్మడం?

"మార్నింగ్ నువ్వు బ్రేక్ ఫాస్టు చేసింది. కదా" అని ఎవర్నో అడగడంతో, అంతా అతను బ్రేక్‌ఫాస్టు చేసాడు అనుకుని అతన్ని వదిలేసి వెళ్ళిపోయారు. ఆ కెమేరామెన్ వచ్చి నాతో దిగాలు మొహంతో "నన్ను నీది సన్మానం నిన్న అయింది.. రేపు నీ పేరు పిలిచారు" అని చెపితే 'నా పేరు సన్మానింపబడిన వాళ్ళ లిస్టులో వేసేసారు. దాంతో నా సన్మానం ఆగిపోయిందండీ. వాడి పాస్టెన్స్ ప్రెజెంటెన్స్ గానూ, ప్రెజెంటెన్స్ పాస్టెన్స్‌గానూ తగలడి, ప్రాబ్లెం అయిపోతోంది" అని బావురుమన్నాడు.

వీడి బాధలు మేవంతా ఉండగా, రాత్రి మగాళ్ళు మందు వేసుకుంటుంటే, వీడో లిమ్కా బాటిల్ తీసుకుని వచ్చి 'ఛీర్స్' అని కొడితే అవతల వాడి కాస్ట్లీ లిక్కర్ సీసా పగిలి రెండు ముక్కలైందిట.

ఈ విధంగా మమ్మల్ని భూతభవిష్యత్ వర్తమాన కాలాలు అర్థం కాకుండా చంపుకున్న ఇతను నన్ను మలేషియాతో వదిలి పెట్టలేదు. మలేషియా నుండి ఇండోనేషియా వెళ్ళినా తప్పలేదు. ఎందుకంటే నా టికెట్ ఇండియాకి ఇంకా కన్ఫర్మ్ అవలేదు.

ఇతను నా ఇండోనేషియా నెంబర్‌కి ఫోన్ చేసి "రమణీ వస్తుందీ నిన్నా?" అన్నాడట.

మా బాబాయ్ కొంచెం సుత్తి వీరభద్రరావు టైప్,

"నిన్నకీ వస్తుంది కీ ఏవైనా సంబంధం ఉందా?" అని క్లాస్ పీకి "ఇంతకీ ఎవరు నువ్వు?" అన్నాడు.

అతను "రమణీ చెప్పాడూ టికెట్ కావాలి 17 కి" అని అన్నాడు.

"రమణీ చెప్పిందో, చెప్పాడో తెలీని వాడివి నీకు సరిగ్గా వచ్చిన భాషలో చెప్పి ఏడు" అని బాబాయ్ మండిపడ్డాడు. మొత్తానికి వాడి వ్యాకరణం బాధ వదిలించుకుని నేనే టికెట్ కొనుక్కుని వచ్చేసాడు. సారీ.. వచ్చేసాను. వారంలో నా భాష కూడా వీలైనంత పాడయింది.

మా చెల్లెలు ఇండోనేషియాలో జటల్‌మర్‌లో ఇండోరమాలో ఉంటుంది. అక్కడ పాలని 'సుసు' అంటారుట. అదో గొడవ. పాలు వారానికి రెండుసార్లు వాళ్ళ గేటు దగ్గరకి వస్తే మా మరిది పేరు చెప్పి, "శ్రీకాంత్ సుసు" అంటే పాలు పోస్తారట...అదో ఖర్మ.

నాకు ఈజీగా వాళ్ళ భాషలో వచ్చిన మాట 'బాగూస్' అంటే బాగుంది అని.

ఇక్కడ జనం ఒకళ్ళతో ఒకళ్ళు చాలా మృదువుగా మాట్లాడుకుంటారు. ఇద్దరు టూ వీలర్స్ మీద వచ్చి డాష్ ఇచ్చుకున్నా, నమస్కారాలు పెట్టుకుని సంస్కారంగా విడిపోతారే తప్ప పోట్లాడుకోరుట.

"ఎందుకు పోట్లాడుకోరక్కా?" అంటుంది ఆశ్చర్యంగా మా చెల్లెలు. అదే మన హైదరాబాద్ అయితే, ఏక్సిడెంటువల్లకాదు వీళ్ళ కొట్లాట వల్ల తలలు పగుల్తాయి.

మా చెల్లెలి కొడుకు పదేళ్ళవాడు అఖండంగా మాట్లాడతాడు. నేను వెళ్ళగానే, బాబాయ్ ఇండియా వదిలాక బంధుగణంలో ఎవరెవరు పోయారో ఏకరువు పెడ్తుంటే, బాబాయ్ శ్రద్ధాంజలి ఘటిస్తున్నాడు. ఇంతలో ఈ చిడుగు "ఖుషీ కా మో కే పే క్యో ఏ టాపిక్స్?" అన్నాడు. 'నిజమే' అనుకుని నేను ఎవరెవరికి పిల్లలు పుట్టారో, పెళ్ళిళ్ళు అయ్యాయో చెప్పుకొచ్చాను.

ఈ చిడుగు ఎదురింటికెళ్ళి స్లీప్ ఓవర్ అయి ఇంటికొచ్చాకా "ఆంటీ ఏం చేసి పెట్టిందిరా?" అంటే "చోలే బతూరా" అన్నాడు.

"ఆంటీ ఎలా చేసింది?" అని అడిగా.

"ఏజ్‌కి తగ్గట్టే చేసిందిలే" అన్నాడు. వాడి జవాబుకి తెగ నవ్వాము. అంతటితో ఆగకుండా "ఆంటీకి ఈ మధ్య ఇల్లు డెకరేట్ చెయ్యాలన్న పిచ్చ పట్టుకుంది" అన్నాడు.

వాడి ముది మాటలకి నేను నవ్వి "ఏం చేసిందిరా?" అన్నాను.

"కమోడ్‌కి టాయ్‌లెట్‌లో పూలపూల కవర్ వేసింది. .. పైన ఓ స్టిక్కర్ అతికించింది కూడా" అన్నాడు. నేను నిజంగా ఆశ్చర్యపోయాను.

ఇండోరమా నుండి జకార్తాకి నాలుగు గంటలు ప్రయాణం చేసి బాబాయ్ నన్ను తీసుకెళ్ళడానికొచ్చాడు. పిన్ని టిఫిన్ క్యారియ కూడా ఇచ్చి పంపింది. నేను కారు ఎక్కగానే బాబాయ్ మాటలు మొదలు పెట్టాడు. నాలుగు గంటలు నాలుగు నిమిషాల్లా గడిచిపోయాయి. అంతేకాదు క్యారేజీలో చపాతీలూ, కూరా కూడా ఖతం అయిపోయింది. అలా వారం రోజులు సప్తాహంలా నేనూ బాబాయ్ తెరిచిన నోరు ముయ్యకుండా మా బంధుగణంలో ప్రతి ఒక్కరి గురించీ మంచీ చెడూ(రెండోది ఎక్కువ) మాట్లాడేసుకుంటుంటే "ఇరవై నాలుగు గంటలు.. ముప్పై ఆరు గంటలు... నలభై ఎనిమిది గంటలు" అంటూ మా చెల్లెలు లావణ్య లెక్క పెట్టి గిన్నీస్ బుక్‌లో ఎక్కడానికి మాకు అన్ని అర్హతలూ ఉన్నాయని తీర్మానించేసింది.

మాటలు నిజంగా వరంకదా! ఏదో ఒక భాష రాకపోతే సైగలతో మనిషి 'కమ్యూనికేట్' చెయ్యకుండా మాత్రం బ్రతకలేడు కదా!

మనింటికి ఎవరైనా వచ్చి ఓ గంట కూర్చుని వెళ్తే వాళ్ళు ఎలా మాట్లాడారో, ఏ మాటలు ఎక్కువగా మాట్లాడారో మనం గమనిస్తాం. అవి తలచుకుని నవ్వుకుంటాం. అలా మాట అనేది అంత ముఖ్యం. మనిషి మంచైనా చెడైనా మాట వల్లే తెలుస్తుంది.

ఒకావిడ "ఆ వంకాయిలు వేగి చావలేదండీ. ఈ పనిమనిషి టైంకి వచ్చి చావదండీ. ఆ కుక్కర్ పాడయి చచ్చిందండీ. ఈ పప్పు ఉడికి చావలేదండీ... ఈయన తిని చావలేదండీ .." ఇలా మాట్లాడుతుంది.

ఇంకో కోటీశ్వరుడు "ఛ.. దరిద్రం ఫ్లైట్ టైకి రాలేదండీ.. దరిద్రం ఆ నూరు ఎకరాలూ చిన్నాడు అత్తారిచ్చినవి.. దరిద్రమా అని ఈ ఏడూ షేర్లలో ఓ ఇరవై కోట్లు వచ్చాయి. అమ్మాయికి దరిద్రం అదేదో లండన్‌లో సీటొచ్చింది." అని దరిద్రం ఊతపదం చేసుకున్నాడు.

ఇంకో ఆయన "నా శ్రాద్ధం ఏదో అమ్మాయికి సంబంధం కుదిరింది. నా శ్రాద్ధం వ్యాపారంలో కలిసొచ్చిది కాబట్టే ఇల్లు కొన్నాను. గుడికి వెళ్ళా. పూజారి శఠగోపం పెట్టాడు శ్రాద్ధం" అంటూ తన శ్రాద్ధం తనే పెట్టుకుంటాడు.

"నువ్వన్నట్లూ మా పక్కింటావిడ ఉత్త గయ్యాళి. నువ్వన్నట్టూ ఉసిరి ఆవకాయలో నువ్వుల నూనె బావుంటుంది" అని మాట్లాడ్తుంటే 'నువ్వన్నట్టూ' అన్నప్పుడల్లా మనం ఉలిక్కిపడతాం. ఎప్పుడు అన్నామా? అని.

"మీ ఇంటికి పిలుస్తున్నారా? నా మొహం వస్తాంలెండి. మీరు చేసిన ఆవడలు ఎలా ఉన్నాయా? నా మొహం బావున్నాయి. మీ అక్వేరియం ఎలా ఉందనా? నా మొహం బాగానే ఉంది" ఇలా కొంతమంది.

'మాటే మంత్రమా... మనసే బంధమా' అని ఊరికే అంటారా? మాట ఎంత ముఖ్యం అంటే మనకి నలుగురు మిత్రుల్ని చేసేదైనా శత్రువుల్ని చేసేదైనా మాటేగా మరి.

"వాదనకి వల్లూరు వెళ్తున్నాను. వాడకట్టు సవతులారా నా వాకిలి కాయండి" అందట ఒకావిడ. ఇంక వాదనకి వల్లూరు ఎందుకూ? అక్కడే మొదలయింది జగడం.

సో.. మాట మనకి ఎంత మంచి చేస్తుందో అంత చేటూ చేస్తుంది. అందుకే 'నోరా వీపుకి తేకే' అన్నారు పెద్దలు.

కాశీ గురించి మొదలు పెట్టి, ఇండోనేషియా తీసుకెళ్ళి, తిరిగి మాట దగ్గరకి వచ్చి వదిలేసా అనుకుంటున్నారా ఏదైనా వదిలేయచ్చు కానీ మాట జారవిడవకూడదు. ఓసారి అనుకుని దాని వల్ల ఏ హానీ జరగదనుకుంటేనే మాట వదిలిపెట్టండి. కాశీకి పోయాను రామా హరీ.. గంగ తీర్థమ్ము తెచ్చాను రామా హరీ!

కాశీలో ఎవరేం వదిలేసినా తెచ్చేది మాత్రం గంగ తీర్థం. ఎందుకో తెలుసా? గంగ అంటే పవిత్రత అని అర్థం.

సో.. పవిత్రతని కాపాడుకొమ్మని అన్యాపదేశంగా మన పెద్దవాళ్ళు ఈ కాశీ చెంబుల ద్వారా చెప్తారు. నిగ్రహాన్ని పరీక్షించడానికి ఏదైనా వదిలెయ్యాలి కానీ, ఇష్టంలేని ప్రతి చెత్తనీ వదిలెయ్యమని కాదు కాశీలో.

**గంగని ప్రక్షాళనం చెయ్యంటున్నారసలే మోడీగారు.**

Post your comments

